కథానిక:

★

శ్రీ బలివాడ కాంతరావు

★



"దీని మొగుడు విడిచిపోయాడు. ఆ అన్నా వదినా మంచివాళ్ళవబట్టి యేదో కడుపుకి జరిగిపోతోందత్తయ్యా" అని సుందరమ్మని చూపించి మాణిక్యం చెప్పేసరికి 'అయ్యోపాపం!' అంది ఆ గొప్పింటావిడ.

సుందరమ్మ యిలాంటి మాటలు వినటం తొలిసారి కాదు. యెందరో ‹ం లా నే "పాపం" అన్నారు. అంతే కాని యీవిడ మాత్రం "అయ్యోపాపం" అని పూరుకోకండా ఆమెనిగురించి పూర్తిగా తెలుసుకోడానికి వుబలాటపడింది.

గదిలో సావధానంగా కూర్చుని తమలపాకుల పెట్టె ముందు పెట్టుకొని తీరిగ్గా చెప్పడానికి వుపక్రమించింది మాణిక్యం- 'ఏదీ... నేను కాపరానికి వచ్చి యిరవై యేళ్లు కావొచ్చు అయ్యింది. అప్పుడు యిది కడుపులో వుండేది. వీళ్ళమ్మ చచ్చి ఏ స్వర్గాన వుందోగానీ ప్రాణం పెట్టేదత్తయ్యా. .మా అబ్బాయి కరిణీకం కాదుగానీ లేని పని కల్పించుకునేవారు. .పొరుగున వీళ్లు లేకపోతే పిల్లాపిచ్చుక లేకపోయినందుకు ఒంటిగా చచ్చేదాన్ని..."

వంటయింటి తలుపుచాటునుంచి వింటున్న సుందరమ్మ పొయ్యిలో కర్రల్ని యెగదోసి మళ్లీ తలుపుచాటుకి వచ్చింది. సుందరమ్మ కథ బదులు మాణిక్యం కథే అడ్డూ ఆపూ లేకుండా యింకా సాగిపోతోంది. కొస్సేపటికి ధోరణి మారటంతో సుందరమ్మ నిట్టూర్చింది.

"అన్నా చెల్లెలికీ ఒక్కసారే పెళ్లయింది. ఆ అల్లుడు చూస్తే యేనుగంతమనిషి - దీనికి యెనిమిదేళ్ళు...బొద్దుగా నల్లగా వుండేది. ఆ కాలంలో యీడాజోడా-నీకు తెలిదూ! పదేళ్లు కాకండా పెళ్ళి కావాలిగానీ...నరసింహం కిజోడీ బాగాకుదిరింది...కాని వాడి దరిద్రం యేమిటో అత్తయ్యా—యేటేటా హెచ్చిపోతోందిగానీ తీరేదారి కనిపించడం లేదు. యిద్దరుపిల్లలు - వాళ్లకి కడుపునింపుగా తిండిపెట్టలేక యేడుస్తాడు. మనం యేదో కనికరించి నాలుగుగింజలిస్తే యెన్ని పూటలు తింటారు? ఆ చదువా...గోచీకి పొడవూ గావంచాకి కురచా అయిపోయింది. ఉన్నూర్లో కూలిపని నామోషీ కాదూ? యేదో వ్యవసాయం పనా అంటే అదీ చేతకాదు-మనిషేం బలంగా వున్నాడని! గోరుచుట్టుమీద రోకటిపోటులా యిదొకటి! ఆ వెధవ దీనికి బుద్ధొచ్చేవరకైనా వున్నాడు కాదు. అల్లుడని మహా సర్దాపడి వున్న కాస్త బంగారం పిసర అమ్మి బాగా తినిపించేది - స్వర్గంలో యెక్కడుందో శాంతమ్మత్త. ఇదంతా దానికి కావాలా అత్తయ్యా. కష్టపడేవాళ్లు వీళ్లేగా. సంసారం యిలావుంటేయీ సుందరమ్మకి శాంతం వుండొద్దా, అంటాను. పదేళ్ళయింది ఆ వెధవ కాపదాన్ని పట్టుకొని యేకలకత్తా వెళ్లిపోయాడో? వాడు మళ్ళీ వచ్చి దీన్ని యేలుకుంటాడని ఆశగా నుందా? యేమీ లేదు. సంసారం అన్నాక యేదో మంచో చెడ్డో యెవరివల్లో ఒకరివల్ల తప్పో ఒప్పో వుంటుందా? అందులో ఒకపూటకుంటే ఒకపూట కు లేని సంసారమాయె - సర్దుకుపోవాలిగానీ. నరిసింహం పెళ్లాం కాస్త నోరున్న మనిషి—చికాగ్గా వున్నప్పుడు యేదో అంటుంది. నా ఖర్మం యిలా కాలిందని యేదో సర్దుకు పోవాలి గానీ...

కొంటె జవాబు లెందుకివ్వాలని... నాలుగు తింటుంది...మరి నా మనసు వుండబట్టదు. ఒంట్లో నీరసంగా వుందని... యిలా యెవరైనా వచ్చినప్పుడు కాస్త వండి పెట్టమ్మా అని తెస్తుంటాను. 'ఒక పూటైనా కడుపు నిండా తింటుందని......"

ఉపదేశధోరణిలో వెళ్ళిపోతున్న స్వీయగాధని సుందరమ్మ ఆలకిస్తున్నా, యిదంతా నిజానికి చాలాదూరం అనుకుంది. తనెప్పుడూ వదినెకు కొంటె జవాబు లివ్వలేదే. అందరిలా మాణిక్యంకూడా వదిననే సమర్థిస్తోంది. ఆమె తనకి కట్టుకోమని యిచ్చిన పాతచీరను వదిన బలవంతంగా లాక్కోవడం ఆమెకు తెలుసే! అన్నయ్యని అడిగి పొరుగూరి వుత్సవానికి వీధిలో వారితో వెళ్ళిందని నోటికివచ్చినట్లు మాణిక్యం యెదరనే కూసింది! 'అయ్యో భగవంతుడా నాపిల్లల కడుపు మాడ్చేస్తున్నావ్. అవును – జేష్టాదేవి మాయింట్లోవుంటే సిరెక్కడవచ్చిపట్టుంది? యిలా పరోక్షంగానైనా తనకి వినిపించేటట్లు వదిన అన్నదే! అప్పుడు మాణిక్యం యెదురుగానే అమ్మను తలచుకుని కడుపు సముద్రమయ్యేటట్లు యేడ్చింది. గంజినీళ్ళైనా గిన్నె నిండుగా పోసుకోనివ్వరు – యిలాగ ఒక్కనాడైనా అమ్మ చేసిందా? మాణిక్యంకు యివన్నీ తెలుసే–తన కష్టాలు యేం చెప్పుకున్నా ఆమెతో తప్పించి యింకెవరితో చెప్పింది? సమయానికి తగ్గమాటలు ఆడి తనని ఓదార్చేది – చివరకి తనగురించి యింకొకరితో చెప్పేటప్పుడు నిజాన్ని యింతగా మభ్యపగుస్తుందేం?

వదిన అన్నట్టు యేడిస్తే ఓదారుస్తుంది. తన అమ్మను తలచుకొని యేడిస్తే 'యెందుకమ్మ నిండుప్రాణాలున్న యింట్లో యీ రోదనం' అంటుందేం? బ్రతికున్న చివరి రోజుల్లో నిద్రాహారాలు లేక 'నేను కళ్లు మూస్తే నాకూతురుగతేం కాను'అని అమ్మ పలవరించి యేడుస్తోంటే వూరుకో అమ్మా' అని ఓదార్చేది. యిప్పటి తన పరిస్థితిని, అమ్మ యేడుపునూ మనసులో వుంచుకొని ఆలోచిస్తుంటే తల మొత్తుకోనేటంత దుఃఖం వుబికింది. యీసంఘంలో ఆడదానికి, అందం శక్తి, దక్షత–వీటిలో యే ఒకటి లేకపోయినా, బ్రతకటం దుర్లభం. సుందరమ్మకు వీటిలో యేదీ లేదు.

అస్పష్టమైన ఆలోచనలతో తలంతా తిరిగిపోయింది. వంటగది పొగతో నిండిపోయింది. చుట్టపుచూపుకు వచ్చిన ఆగొప్పింటావిడ అన్నమాటలు చెవిలోకి దూసుకుపోగానే సుందరమ్మ గతుక్కుమంది. జబాబుగా మాణిక్యం "తప్పకుండా" వస్తుంది. మీయింట్లో తిరిగే భాగ్యం పట్టాలా? మరేం పూచీ లేదత్తయ్యా! వంట చెయ్యటంలో మహాఘటికురాలు. మాంచిరుచైనకు చెయ్యి కడుపుకు తిండీ, ఒంటికి బట్ట దొరికితే యింకేంగావాలి...యేం చాతకాని అన్నదమ్ముడు. యేదో ఎప్పుడో మీరు కనికరించి నాలుగురాళ్లు పంపిస్తే రెండు పూటలు తింటాడు"...

మాణిక్యమ్మ యిచ్చిన యీ సమాధానం నవ్వుల్లో గుయ్ మనటంతో సుందరమ్మ వుక్కిరిబిక్కిరైపోయింది. గడబిడగా పొయ్యిదగ్గర కూర్చొని ఆత్రుతకొద్దీ గొట్టం పట్టుకోకుండా వూదింది. కళ్లల్లోనూ, ముఖంమీద బూడిదరేణువులు అంటుకున్నాయ్ – కళ్లు నలుపుకుంది. మాసినచీర కొంగుతో ముఖాన్ని కప్పుకొని...తల పగిలిపోతున్నట్లు, నరాలన్నీ తెగిపోయినట్లు బాధ పడింది.

మాణిక్యం వుత్సాహంతో నవ్వుకుంటూ వచ్చి "నీ కష్టాలు గట్టెక్కాయ్‌లేవే. పట్నంలో కడుపునిండా తిను. రామా కృష్ణా అని పడుండు. వెంకమ్మత్తయ్యతో రేపే నీ ప్రయాణం."

మబ్బుల్లోనించి ఆకాశవాణి గర్జించినట్లుగా పొగమధ్యనుంచి "నేను వెళ్లను" అంది సుందరమ్మ.

"యేమిటే! వెళ్లవూ? యేమే నీకు మతిగాని పోయిందా? నరసింహం – మీవదినా ఒప్పుకుంటే."

యీ మాటలతో ఆమెఒళ్లంతా బరువైపోయింది. అలా కూలబడి కూర్చుంది. గర్జించిన గొంతుక శోకంతో నిండిపోయింది. యేమీ ఆలోచన తోచక హృదయంలో పెద్దపెట్టున యేడ్చుకోవటం మొదలుపెట్టింది. ఎందుకో పెదిమలు కంపించాయ్ – నల్లని ముఖం పాలిపోయింది. దుఃఖం జలపాతంలా పడి కడుపును దొలిచివేసింది – అమ్మను తల్చుకొని దుఃఖాన్ని ద్విగుణీకృతం చేసింది.

మాణిక్యం ఒకేదృష్టిలో చూస్తోంది కాబట్టే యిదేమీ అర్థం కాలేదు. పైగా సుందరమ్మ ఒక పిచ్చిదానిలా కనిపించింది. తలవనితలంపుగా అరచేతిలోనికి వచ్చే సుఖాన్ని విడిచిపెట్టుకోవటం శుద్ధ తెలివితక్కువ కాదా? అయినా ఆమెమాటకు తిరుగుండదనే ధైర్యం లేకపోలేదు. అంచేతనే నిర్లక్ష్యంగా వెళ్లిపోయింది.

సుందరమ్మకు ఒక క్రొత్త నరకం కనిపించింది. అందులో ఆమె పడవలసిన బాధలు కళ్లకు కట్టాయ్. భాగ్యవంతుల యిళ్లల్లో యెప్పుడూ వాళ్లగురించి వినంది యెలా పనిచెయ్యటం? పోనీ వెంకమ్మ ఆ యింట్లో వుంటే యెలానో ఓలా ఆమె అండను నిలచి పనిచేసేది. ఆమె తీర్థయాత్రలకు వెళ్లిపోయి కొన్ని నెలలవరకు రాదట! అలాంటప్పుడు అసహ్యమైన బట్టలతో నల్లటి ముఖాన్ని వాళ్లకి చూపించటమెలా? అమ్మను తెలిసినకదినే యిలా అంటుందే– అమ్మను తలచుకొని యేడిస్తే అమ్మముఖం చూడనివాళ్లు యింకెంతగా తనని ఒళ్లు చచ్చిపోయిన మాట లంటారోనే యింతో అంతో వున్న మాణిక్యానికే అంత టెక్కు కదా, మేడమిద్దెలో గంపెడు బంగారంతో వున్నవాళ్ల కింకెన్నిరెట్లు గర్వమో?

ఇలా ఆలోచిస్తూనే కళ్లల్లో నీరు నిండుకుంటోంది. పెరటితలుపు తెరచివుందేమో ఆ కళ్లతోనే చూసింది. పచ్చని పంట పొలాలు, తను రోజూ తెల్లవారేసరికి బుడకపెట్టినది, రోజూ నీరు పోస్తున్న బంతిమొక్కలు, కుడితికుండ మోసుకెళ్లేటప్పుడు ఆత్రుతగా 'అంబా'అని పలుకరించే ఆవు – కనిపించాయ్. జామిచెట్టుకు కట్టిపెట్టినమూడ గిజగిజ గింజుకుంటోంది. ఆవు ఆత్రుతపడుతోంది. సుందరమ్మఒళ్లంతా జరజరలాడింది. తల్లి గతించినదగ్గరనుంచి అసహాయత ఒక అలుపుపెట్టినట్లే ఆమెజీవితం మీద పనిచేస్తోంది. యిలా వుద్రేకం కలిగేటప్పుడు అమ్మకాళ్లు గట్టిగా పట్టుకొనేది. కానీ యిప్పుడు ఆకళ్లకి కాగకుండ,నిప్పుతో మండేపొయ్యి అగపడింది. ఒళ్లంతా చెమట పట్టింది–అమ్మే బ్రతికుంటే యింకొకరింటికి తనని పంపించేదా? ఆ గంజోకడుగో వున్న యింట్లోనే త్రాగే పడుండనిచ్చేది.

ఆ మరుక్షణంలో వదిన మస్తిష్కంలో విహరించింది. తల బాగా బరువెక్కింది. మాణిక్యంఅన్నమాటలు గింగురుమంటోంటే ఆ చీరకొంగును అలా పొయిలో తనచేతితో కర్రలుపెట్టేటట్లే పెట్టాలనుకుంది. చెయ్యి వణికింది–అందంగా కనిపించింది. నాదీ అనే అభిమానం గుండెకు హత్తుకుంది. ఒళ్లు నింపుగా వున్న యౌవ్వనాన్ని ఒకసారి చూసుకుంది. ప్రయోజనంగూర్చి ఆలో

-చించకపోయినా మెదడుమారుమూలల్లో ఒక తియ్యని తలపు దాచిపెట్టుకుంది.

* * *

సుందరమ్మకు భవిష్యత్తంతా నిరాశగానే కనిపించింది. యీ పల్లెలో జ్ఞానం వచ్చాక సుఖపడ్డానని తృప్తిపొందలేదు. కష్టపడ్డది. ఆ వూళ్లో వీచేగాలి, కాచేయెండా, పెరిగిన పైరూ, విరిగిన ఆశలూ ఆమెను పెంచుకొచ్చాయ్. ఆవూళ్లో గడియకున్న యేడుపు తప్పించి, ఆమెవుపయోగించుకొన్నవీ, సేవించేవి, అన్నీ దూరమైపోతాయ్.

వెళ్లిపోయేముందొక యేమకలపోగు కనిపించింది. ఆశ అనేది సూక్ష్మదర్శినిలోనైనా కనిపించినట్లుంది...కడుపు అంటుకుపోయింది. తన శరీరమనే అభిమానం యేమాత్రం లేదు. అమ్మ వున్నప్పుడు అన్నయ్యనీ-యీ అన్నయ్యనీ-యెదురుగా పెట్టుకొని మాస్తుంటే గాబరా...జాలీ యేడుపూ రక్తంలో కరిగిపోయాయ్. బాధ భరించలేక తలుపుచాటున ముఖం దాచుకొని బావురుమని యేడ్చింది.

అన్నయ్య కొంతదూరం సాగనంపడానికి వచ్చాడు. ముఖంలో నెత్తురుచుక్క లేదు. ఒక్కమాట చెప్పలేకపోయాడు. తన చేతిలో పెట్టి 'జాగ్రత్త నాయనా!' అని కళ్లుచూసిన తల్లికే ద్రోహంచేస్తున్నానని కుమిలిపోతున్నాడు. అడుగుతీసి అడుగు వేస్తోంటే ఒళ్లు ఝుల్ ఝుల్ మంటోంది...అయితే ఒక మంత్రంలా దాని వెనకాలే తన దరిద్రం, తన పిల్లల యేడుపూ తనమీద పనిచేస్తున్నాయ్.

తలవంచుకొని వెనుక నేవచ్చే అన్నయ్యను చూసింది. తన భారం కొంచెం తగ్గి, తనేమైనా సహాయపడేస్థితివస్తే యేమైనా కోలుకుంటాడనే ఆశ మొలకెత్తటంచేత, దుఃఖాన్ని దిగమ్రింగుతో నడుస్తోంది. పాలిపోయిన ముఖంతో పలకకుండా వచ్చే అన్నయ్యతో అనలేక అనలేక "నువ్వేందు అన్నయ్యా! వదిననీ యేమీ అనకు. ఆ తల్లికి యెప్పటికైనా కనికరం పుట్టదా?" అంది.

రోజూ తెల్లారేక యేటిలో ఒక బుడక పెట్టి పార్వతీశిలలకు పసుపు రాసి మ్రొక్కేది. ఆ తల్లి మరెవరో కాదు. పార్వతీదేవి. ఆ శిలలను విడిచిపెట్టినా ఆ భక్తినీ, నమ్మకనూ తనతోనే తీసుకుపోతోంది. నీరు పల్లమెరిగినట్లే యిలాంటి అమాయకపు జీవులు సత్యపథాన నడుస్తారు.

చురచురశబ్దం వినిపించింది. ప్రక్క పొలంగట్టువారగా బురదను చీల్చుకుంటూ యేదో జీవి ప్రాకిపోతోంది!

"వస్తానమ్మా" అని వెళ్లిపోయాడు నరసింహం. బురదతో వున్న పొలంగట్లమీదుగా నడుస్తూనే వెనుకకు తిరిగిచూసేది-అన్నయ్య దూరంఅవుతున్నకొద్దీ ఆమెగుండె బరువెక్కేది...గట్లుదాటి రోడ్డు చేరేటప్పటికి తను యెన్నడూ చూడని చెట్లూ చేమలూ మనుషులూ తారసిల్లారు. వెంకమ్మ తన మనుమడు, మనుమరాల గొడవ, వాళ్ళ రుచులూ, పచులూ, అలవాట్లూ, అభిప్రాయాలూ తోచినట్లు చెప్తూనేవుంది. గైలుస్టేషను చాలా దగ్గరనిపించింది.

* * *

పట్నంలో ఆ మేడలో వున్న సామానులనీ, వాకిట వున్న కుక్కనీ; దొడ్లో వున్న రంగురంగుల మొక్కలనీ చూసే కాక ఎలక్ట్రిక్ దీపంవల్ల యేర్పడిన తన నీడనే చూసి భయపడింది. ఆ యింట్లో వెంకమ్మ తప్పించి మిగతావాళ్ల యెదురుగా నిలపడ్డానికి ఒళ్లు చచ్చిపోయేది. ఆ రాత్రంతా సుందరమ్మకు సరియైన నిద్ర లేదు. అన్నయ్యా, వదిన, మాణిక్యం, యేరు, పొలాలు, పొయ్యి, ఆవూ, దూడ, బంతిమొక్కలూ ఆ వూరంతా తలలోనే పెట్టుకుంది. యీ సిమెంటు గచ్చు చల్లగా, యీ అన్నం మోటుగా అంతా అదోకలా వుంది. రాత్రి జరుగుతున్న కొద్దీ తిరిగి వెళ్లిపోవాలనే కోరిక ప్రబలసాగింది. తెల్లవారఝామున మగతనిద్ర కమ్మేసింది. యేవేవో కలలు గంద. తెలివి వచ్చేసరికి భళ్ళున తెల్లవారింది. నాలిక కరుచుకొని గబగబ లేచిపోయింది. అప్పటికి యింట్లో యెవరూ లేవలేదు. ఎటు వెళ్లాలో యేం చెయ్యాలో తోచలేదు. తెల్లని గోడలూ, మంచాలు, కుర్చీలు, బెంచీలు బీరువాలూ, బొమ్మలు అగపడ్డాయ్. మరుక్షణంలో యెదురుగా యేరు - వాళ్ళయిల్లు ...పార్వతీశిలలు, బంతిమొక్కలు...రాను రాను లీలగా తను నడుస్తుండగా మందంగా వీసెగాలికి చురచురలాడుకుంటూ తలలు వంచుకొనే వరిపైరూ...ఒక్క యెగురు యెగిరి కూలబడిపోయే మిడతలూ...జురజుర శబ్దంతో బురదనీ, పైరునీ చీల్చుకొనిపోయే పాము—అమ్మో.. అడిగో యేడవ గలిగినా యేడవలేని అన్నయ్య వెనక్కి వెళ్లిపోతున్నాడు...తలబరువు మొయ్యలేక మళ్లీ చాపమీద బోర్లపడింది. మనస్సంతా దుఃఖంతో నిండిపోయింది. అమ్మాఅని వక్షాన్ని హత్తుకొని జోడించిన చేతులతో తల్లినీ, పార్వతీదేవినీ ప్రార్థించుకుంది.

"లే అమ్మా సుందరీ" అంది వెంకమ్మ. యీపిలుపుతో ఒళ్ళంతా గిలిగింతలతో నిండిపోయింది. లేస్తూనే దుఃఖాన్ని దాచిపెట్టింది. దుఃఖానికి లొంగిపోవటం, మళ్లీ దానినుంచి హఠాత్తుగా విడుపించుకోవటం అలవాటైపోయిందామెకు.

కాలకృత్యాలన్నీ నేర్చుకొనే స్థితి వచ్చింది. నూతినీరు తోడుకొని స్నానం చేసినా ఆమెకు స్నానంచేసినట్లు లేదు. ఒళ్లంతా -చించుకున్నట్లు - మనస్సంతా యేదో తప్పుచేసినట్లు వికారంగా వుంది. వాళ్ల యింట్లో పార్వతీశిలలు లేవు. పూజ చెయ్యటానికి బంతిపువ్వులూ లేవు. రంగురంగుల బొమ్మలు - గుడ్డతో చేసిన హారాలూనూ. అసలు యీ యింట్లో పసుపు అనేదే కనపడలేదు. వెంకమ్మప్రక్కనే నిలబడి విధిలేక మ్రొక్కవలసివచ్చింది. పూజగది యెంత శుభ్రంగా వున్నా పూజా విధానం ఆమెకు యేమీ నచ్చలేదు.

యీ వూరులో, మనుషులూ, యిల్లూ, వస్తువులూ, వాహనాలూ అన్నీ వాళ్ల వూరిలో వున్నవాటితో సరిపోల్చటానికి తబ్బిబ్బైపోతోంది. తను చూస్తున్నదీ, తను యిదివరకు చూసినదీ ఒక్క పెనగా వుంచి ఆలోచించబోతుంది. దుఃఖం వచ్చేటప్పుడు, అభిమానం కరిగిపోయేటప్పుడు, లేక కోరిక తాండవించేటప్పుడు అక్కడ కనపడినట్లే యిక్కడా మండే పొయ్యి, రాగే వంట పాత్రలు కనిపిస్తున్నాయ్. అక్కడ మట్టి పొయ్యి, మట్టికుండ కనిపిస్తే యిక్కడ మరింత భీకరంగా యినపపొయ్యి, రాగి పాత్ర కనిపిస్తున్నాయి. అయినా రోజంతా ఆ వంటయింట్లో ఒకమూల కూర్చొని యీ మనుషుల్నీ మేడల్నీ చూడకుండా వాళ్ల వూళ్లో యేరునీ, వెన్నెల్నీ, వానల్నీ, పొలాలనీ, మనుషుల్నీ తలచుకోవాలని కోరిగ్గా వుండేది.

* * *

వెంకమ్మ యిల్లంతా చూపించాక వరండాలో సుందరమ్మని కూర్చోబెట్టి లాలిస్తూ అంది. "యీ యిల్లు నీ యిల్లనే మెసలాలమ్మా. మనుషులంకదా. యేవో తప్పులు చేస్తాం. మనసులో పెట్టుకోక నీకేం లోటుపాట్లు వచ్చిన

(33 వ-పేజీ చూడుడు)

నరకంలో స్వర్గం

(16-వ పేజీ తరువాయి)

ఆదిగో కోడలుంది. చెప్పమ్మా. నీ మీదే ఆశ పెట్టుకొని యాత్ర సాగించేస్తాను. ఆ కాశీ విశ్వనాథుడు, యీ యేడుకొండల వాడు మళ్లీ నింపాదిగా యీ ప్రాణిని యిక్కడకు చేరిస్తే, ఆ దేవుడిపేరూ, నీ పేరూ చెప్పుకుంటాను.

ఈ చివరిమాటలు సుందరమ్మకు విస్మయాన్ని కలిగించాయ్. వెంకమ్మమీద మొదటినుంచీ వున్న అభిమానం, భక్తి కట్టలు తెంచుకొని ప్రవహించింది. వెంకమ్మ యాత్రకు బయలుదేరుతూ కోడల్ని పిలిచి కూర్చోబెట్టి నిమ్మళంగా "సుందరమ్మని జాగ్రత్తగా చూడం"డంది. ప్లీడరుగారి భార్యకు సాధారణంగా 'లా' పాయింట్లు క్షుణ్ణంగా తెలుస్తాయ్. భౌతికదృష్టితో వున్న ఆ 'లా' పాయింటుతోనే "దానికేం లోటు? ఏదో పనిపాట్లు చేస్తుంది. తింటుంది. ఉంటుంది. యేం భయపడకండి."

"అంతేనా కోడలా? తినటం, వుండటమేనా చెప్పావ్? అభిమానం, మంచీ, మర్యాదలూ వుంటాయ్. యెప్పుడూ పట్నం ముఖం యెరగని పిల్ల. పైవాళ్ళయింటికి వెళ్లిన పాపాన పోలేదు. వెంట త్రిప్పుకోవాలి. చేర్పాలి. మీ అందరికీ తిండిదగ్గరికి వస్తే కోపాలూడిపడ్తాయిగా"

"యేదో మేం పడ్తాం లెండి. మీరు కులాసాగా వెళ్లిరండి. అంతకీ కాదంటే వంట బ్రాహ్మణ్ణి పెట్టాం."

యీ మాటలకు వెంకమ్మ నొచ్చుకుంది. సద్భావంతో వీళ్ళంతా సుఖపడతారని, తల్లి, తండ్రీ, మొగుడూ ముగ్గుర్లో యెవరూ లేని దిక్కులేనిపిల్లవి, సేవకు ప్రతిఫలంగా కడుపునిండా తింటుందని తెస్తే - చివరికి ఆమె ఆరాటం అంతా చీపురుపుల్ల చివరవిరిచి పడేసినంత తేలిగ్గా కోడలు మాట్లాడింది! దేవుడున్నాడని నమ్మే వాళ్ళకి దేవునిపుట్టుపూర్వోత్తరాలు, ప్రస్తుత జీవితం అక్ఖర్లేదు. వాళ్లు బాధపడేటప్పుడు యేదో ఒక రూపు, లేక ఒక పేరు పెట్టుకొని స్మరించటంతో బాధ నయంచేసుకుంటారు.

ఏడుకొండలవాడిని స్మరించుకుంటూనే వెంకమ్మ గుమ్మందాటింది. తోడూ నీడా లేని అనాథపక్షిలా సుందరమ్మ అటమటించిపోయింది.

దినదినానికీ ఆమెలో తెలుసుకోలేని ఆరాటంమండిపోతోంది. అయినా అప్పుడప్పుడూ ఆయింటివాళ్ళవిషయం ఆలోచించకుండా వుండలేకపోయేది. వెంకమ్మ రైలుస్టేషనుకు వచ్చిన త్రోవలో మనుమడు, మనుమరాలివిషయం చాలా తక్కువ చెప్పింది. కృష్ణారావు, పద్మ అన్నచెల్లెళ్లా సరిగ్గా ఆమెకు కనుపించలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. మాట్లాడినప్పుడైనా యేదో వాదించుకుంటూ వుంటారు. ఒక చాటునుంచి వీళ్ల సంగతంతా వింటూ కంటూ వున్న సుందరమ్మ అప్పుడప్పుడూ నవ్వుకునేది.

పద్మకూడా అంత చదువెందుకూ? ఈయింట్లో వాడకుండా వున్న సామానులు, బంగారునగలు...అబ్బా అనవసరంగా యింత డబ్బు దిండుచెయ్యటంవలన యేం లాభం? ఆముష్యపద్మకు కొస్తజ్వరం కాసిందని యెందరొచ్చారు? రెండువంద లిచ్చి యింటి యజమానురాలు ఒక చీరె కొన్నది. ఇంటి యజమాని పదిగంటలవరకూ యింటిదగ్గరే వుంటాడు. సాయంత్రం వేగంగానే వచ్చేస్తాడు. అన్నయ్య ప్రొద్దున్ననుంచీ ప్రొద్దుగ్రుంకేవరకూ వీళ్లనీ వాళ్లనీ పట్టుకుంటే ఒక రూపాయైనా రాదేం? యీ సందేహాలకి సమాధానం పెద్ద నిట్టూర్పుతో "కర్మఅంతా పూర్వజన్మలో చేసిన పాపం!" అనుకొని శాంతించింది.

* * *

పద్మ చూపుల్లో యెప్పుడూ అదొక విధమైన వుత్సాహంతో కూడుకున్న కొంటెతనం అగపడ్తుంది. నడుం సన్నంగా శరీరం పొందిగ్గా వుంటుంది. చెప్పుకొని మరిచిపోలేనంత అందంలేదుగానీ, మనిషి శృంగారించుకొని నడుస్తుంటే లావణ్యం వుబికివుబికి వెంటాడుతూ వుంటుంది. పెదాలు చేర్చి, బుగ్గలుపొంగించి, ఆలోచనగా కళ్లప్పచెప్పి చిరునగవు వెలబోయటం సరదా.

కృష్ణారావు అదొకతరహామనిషి. తనకు యేవిషయం తెలియనట్లే వుంటాడింట్లో. పైనకూడేల ఘువులు వేస్తాడు. ఒక్కొక్కసారి యింట్లో వాళ్లమీద విరుచుకుపడటం అలవాటు. అందచందాలవిషయమై ప్రాకులాడటంలో చాలా వుత్సాహం చూపిస్తాడు. ఫోటోలు తీయించుకోవటం సరదా.

సుందరమ్మవచ్చి పదిహేనురోజులైంది. ఇంకా ఆమెకు యింటిమీద ధ్యానం పోలేదు. అన్నయ్యకు వుత్తరం వ్రాయించాలని వుంది. యజమానురాలితో చెప్తే యేమనుకుంటుందో? పద్మని అడగాలనుకుంది. ఎందుకో పద్మను చూశాక భయం వేసేది. కృష్ణారావుని అడిగితే బాగుండుననిపించింది. ఆమెకళ్ల కతడు చాలా మంచివాడిగా కనిపించాడు. ఆమె వండిన వంటకాలని 'ఛీ. బాగులేవు. తిననని' పద్మ ఒకసారి విసిరిపారేసింది. ప్లీడరుగారు 'పల్లెటూరివంటలు మరెలా వుంటయ్' అని హేళన చేశారు. కానీ కృష్ణారావు యేమాటా అనకుండా నవ్వుతూనే తింటాడు. యీ మంచిమనిషిని అడగటంవల్ల తప్పకుండా వుత్తరం వ్రాయించగలననుకుంది. కాని ఆమెకు సిగ్గేసింది. యీ ఆలోచనపుట్టిన మూడురోజులవరకూ ఆయన గదివరకూ వెళ్లి నాలుగైదుసార్లు తొంగి చూచి, మళ్లీ ధైర్యం చిక్కబట్టక తిరిగి వచ్చేది.

నాలుగోరోజురాత్రి కృష్ణారావు చాలా ఆలస్యంగా భోజనానికి వచ్చాడు. మరెవరూ అక్కడ లేకపోబట్టి ధైర్యం కూడబెట్టుకొని లేచిపోయే సమయానికి వుత్తరం వ్రాసిపెట్టమని అడిగింది. ఆయన అలాగే అని చెయ్యి కడుక్కొని వెళ్లిపోయాడు. రెండురోజులవరకూ పిలిచి అడుగుతాడనుకుంది. అటువంటిదేమీ జరగలేదు. అన్నయ్యా, వదినా, మాణిక్యం తననెంతగా నిందిస్తుంటారో అనుకొని భయపడింది. వాళ్లనిప్పుడు తలచుకుంటుంటే ఒక్కొక్కరూ యెంత మంచివారమ్మా అనిపించేది. అన్నయ్య యెప్పుడూ పల్లెత్తుమాటనలేదు. వదినది పెద్దనోరు తప్పించి మనసు మంచిదే.

ఎలా కాకపోతే లేమిలో అన్నయ్యనీ పిల్లలనీ, తననీ చంపెయ్యకండా జరుపుకొచ్చేది. మాణిక్యం నాలుగు తిట్టి బుద్ధులు చెప్పినా, దుఃఖాన్ని పంచుకొనేది... వాళ్లంతా యెంతమంచివాళ్లు! అంతమంచి వాళ్లకుకోపం తెప్పిస్తున్నానని మనసు వుండబట్టక యజమానురాలిని అడిగింది. ఆమె యేమాత్రంచికాకుపడలేదు! "సరే యేం వ్రాయమంటా"వని అడిగింది. సుందరమ్మ ఆలోచనలో పడింది. వ్రాయమనటానికి యెన్నో విషయాలున్నట్లున్నా ఒక్కటీ స్ఫురించ

లేదు. "నేను క్షేమంగా వున్నానని, వదినకూ, అన్నయ్యకూ, మాణిక్యంకూ మ్రొక్కానని వ్రాయడంమ్మా" అంది.

మ్రొక్కడమేమిటే. వాళ్లుగాని దేవుళ్లా-పరే. యింకేమైనా వ్రాయిస్తే వ్రాయించు. నే పద్మతో చెప్తాను" అంటూనే గుజమానురాలు వెళ్లిపోయింది. పద్మ పేరంటే చిన్నపిల్లలకు బూచీ పేరులా వుంటుంది సుందరమ్మకు.

ఆ కొద్ది నిమిషాల్లోనే కృష్ణారావు వంటయింటిదగ్గరికి వచ్చి ఆమెవేపు చూడకుండానే యేమి వ్రాయాలన్నాడు. అంతవరకు నీరు వూరుతున్న కళ్లతో యెదురుగా వున్న మంటల్ని చూస్తున్న ఆమె గాబరాపడి కన్నీరు తుడుచుకుంది. జవాబు చెప్పటానికి మాటలు దొరక్క గింజుకుంది. మరచిపోకండా యిన్ని రోజులకైనా వుత్తరం వ్రాయాలని వచ్చినందుకు సానుభూతి చూపించట మెలాగో ఆమెకు తెలిసిందికాదు.

గబగబలేచింది. బట్టసర్దుకొని తడబడుతూ "అమ్మగారితో చెప్పాను" అంది.

పద్మ యెక్కడికో వెళ్లింది. అమ్మ నన్ను వ్రాయమంది. యింకేమైనా చెప్తావా?" అన్నాడు.

"అంతే" అంది తలవంచుకొనే. కృష్ణారావు వెళ్లిపోతేంటే "పెద్దమ్మగారు యాత్రకు వెళ్లారని వ్రాయండి బాబూ" అంది. ఆయన తల పంకించాడు.

ఆ వేళనే వెంకమ్మ వ్రాయించిన వుత్తరం వచ్చింది. పూరీక్షేత్రంలోని జగన్నాథుని దర్శనభాగ్యం లభించిందని, భువనేశ్వరం వెళ్తున్నానని, సుందరమ్మను జాగ్రత్తగా చూస్తుండమని కూడ వ్రాయించింది.

పద్మ వుత్తరం చదివి పకపకనవ్వుతూ అన్నది.

"మామ్మ పిచ్చిగానీ-యెండి దేవుణ్ని చూడగానే మోక్షం వూడిపడిందా? యీ తీర్థయాత్రలక్రింద తక్కువ తగలేస్తోందా?"

"వెళ్లారేగాని ధ్యానంయిటేగా - తగలెయ్యనీ-మనం యామైనాఅంటే నాతల్లి యిచ్చి చచ్చిందంటారుగా-మనం యెందుకమ్మా చెడ్డఅవటం-అపి చ్చేదో కుదరనీ" అని తల్లి అందుకుంది.

యీ మాటలు సుందరమ్మ వినలేకపోయింది. అంత మంచిమనిషిని పిల్లి లాతులనాడటం, పైగా దేవుని నిందించటం యెంత పాపం! చాలా జోరుగా మాటలు వెళ్లిపోతుంటే కృష్ణారావు వచ్చాడు.

పద్మపదిహేనేళ్ల జీవితంలో, యీ రెండేళ్లలో గడించుకున్న అనుభవంతో అడ్డూ ఆపూ లేకుండా వాగటంతో, కృష్ణారావు అడ్డొచ్చి "పూర్తిగా తెలియంది యే విషయంగురించీ పేలకు. మామ్మగురించి మాటాడటానికి యీయింట్లో యెవరికీ హక్కులేదు"

సుందరమ్మకుపోయిన ప్రాణం మళ్లీ వచ్చినట్లైంది. మన స్సంతా కృష్ణారావుకు జోహారులర్పించింది. ఆవేళనుంచి ఆయనవేపు రోజుకి వందసార్లైనా చూసి నమస్కరించుకోవాలనిపించేది. వీలుచిక్కినప్పుడల్లా ఆగదివేపు ఒకసారి తొంగిచూసేది.

సుందరమ్మదృష్టిని గుర్తించాడాయన. ఇప్పుడు ఆమె యెదురుగా ముఖం ప్రక్కకు త్రిప్పుకొని కాస్సేపు నిలుచుంటున్నాడు. అప్పుడప్పుడూ ఆమెవేపు చూసేవాడు కూడాను. గంటలు దొర్లుతున్న కొద్దీ కృష్ణారావుగూర్చి ఆమె హెచ్చుగా ఆలోచించటం మొదలుపెట్టింది. తనచుట్టూ, తననీ మాసుకొనేది. ఆమెలో యిదివరకెప్పుడూ పొందని యేవో తియ్యని భావాలు కమ్ముకుపోయేవి - ఆమెమనసులోనే కాకుండా, శరీరంలోనూ, నడతలోనూ ఒక విధమైన మార్పు గుర్తించుకుంది.

ఆవేళ శనివారం. కృష్ణారావు, పద్మ యింట్లోనే వున్నారు. సుందరమ్మ పదిగంటలుకాకుండానే వంటపూర్తిచేసి తల దువ్వుకుంది. ముఖంలో కుంకుమరేఖ పెట్టుకొని వెంకమ్మ కొనివెళ్ళిన తెల్లని చీరె, జాకట్ వేసుకొంది. మేడమీద నిల్చొని రోడ్డుమీద వచ్చేపోయేవాళ్లని చూస్తోంది. పద్మయెలా కనిపెట్టిందో నవ్వునాపుకుంటూ క్రిందికివచ్చి అన్నయ్యదగ్గర నవ్వుతూ "ఒక్కసారి మేడమీదకు వెళ్లు చూద్దాం" అంది పందెంవేసినట్లుగా.

కృష్ణారావు మేడమీదకువెళ్లి నిశ్చింతగా రోడ్డువేపు చూస్తున్న సుందరమ్మవేపు కొంత దూరంలో నిల్చొని చూస్తున్నాడు. పద్మ వొంగి మెల్లైగబ్రాకి చెవిదగ్గర నోరుపెట్టి మెల్లగా, "భావకవీ! యే లోకంలో విహరిస్తున్నావ్?" అంది. కృష్ణారావు గాబరా కప్పిపుచ్చుతూ "గతిలేని లోకంలో మతిలేని మనుషులమధ్య" అన్నాడు. యీ మాటలు విన్న సుందరమ్మ సిగ్గుతో దాగుండిపోవటం అన్నా చెల్లెలూ చూడకుండానే మేడ దిగారు.

* * *

ప్లీడరుగారింకా కోర్టునుంచి రాలేదు. పెరటివాకిట మల్లెపొదప్రక్కన ఒక టేబిల్ చుట్టూ కుర్చీలు అమర్చి, పద్మ, యజమానురాలు, కృష్ణారావు కూర్చొని ఒకావిడతో పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు. వంట చేస్తున్న సుందరమ్మపోపుసామానులు తెచ్చుకోడానికి స్టోరుగదిలోనికి వెళ్ళింది.

"యీపిల్లని యిదివరకు చూడలేదే?" అంది ఆ క్రొత్తావిడ.

"చుట్టపు చూపుకు అదేదో పల్లెటూరు వెళ్ళి అత్తగారు తీసుకవచ్చారు. ఇల్లరికం వచ్చిన అల్లుడు కాపదానితో కలకత్తా పోయాడట. తల్లీతండ్రీ లేరు. అన్నదమ్ముడొక దద్దమ్మ. యాత్రలకి దయచేశారుగా. మేం బాధపడిపోతామని వంటకోసం తెచ్చిపెట్టారు!"

ఇంత పెద్ద సమాధానం యేమీ కాదన్నట్లుగా వింది ఆవిడ. సుందరమ్మ సామానులగదిలో సగం చచ్చింది. పద్మ పకపక నవ్వుతూ "మనిషిని చూశారుగా. భూలోకరంభకమా! మామ్మ సుందరీ అని నోటికింపుగా పిలిచేదండీ. అబ్బా...యేమి సౌందర్యం! ఆభావకవులే వర్ణించుకోవాలి."

అంతా ఒక్కసారి ఫక్కున నవ్వారు. అంగులో కృష్ణారావు ఒకడని గుర్తించుకున్న సుందరమ్మకు గుండె ఆగిపోయినంతపనయ్యింది. తెప్పరిల్లినా ఆ చేతులతోనే ముక్కూ, చెవులూ, బుగ్గలూ, కళ్లూ వూడ బెరుక్కోవాలన్నంత అసహ్యం వేసింది.

"ఆ దేవుడిమీద యెంత భక్తంటారు? పసుపు పులుముకుని స్నానంచేసి ఆ గదిలో గంటసేపు కొలుచుకు కూర్చుంటుంది. యీ మట్టి బొమ్మల్లో ఆ దేవుడు వీళ్లకోసమే దాగున్నాడు" పద్మ యేదో పెద్దవిషయం కనిపెట్టినట్లు చెప్తుంటే సుందరమ్మ వినలేకపోయింది.

ఈసారి కృష్ణారావు బిగ్గరగా నవ్వుతున్నాడు. నాగరికతతో మిలమిలమెరిసిపోతున్న ఆవిడ యెదరగా తన నాగరికత చూపించొద్దూ!

సుందరమ్మకు యిదంతా ఒక నరకంలా కనిపించింది. ఇందులో దేవుణ్నే తిట్టారు! హేళనచేస్తారు! ఇంకేం చెయ్యరు? వీళ్లంతా పెద్ద ముక్కులతో వున్న యినప కాకులు! వెంకమ్మ అందుకోసమే యిక్కడ

నుంచి వెళ్లిపోయింది! తనుకూడ వెళ్లిపోవాలనుకుంది. కానీ వదినా, మాణిక్యం యెంత ఆడిపోస్తారు. ఎప్పుడు బాధపడినా 'నేనున్నానని' చప్పున సహాయంచేసేది ఓదార్చేది ఒక్కటే - కన్నీరు!

పచ్చి వ్యభిచారిని 'సీతా'అని పిలిస్తే యీ లోకంలో యెవ్వరైనా నవ్వుతారనుకోను. కానీ ఒక అందవిహీనురాలైన యవ్వనిని 'సుందరీ' అని నోటి కింపుగా పిలిస్తే ఒక్కరైనా నవ్వకపోరు. ఈ సీతాదేవి ప్లీడరు సలహాకి వచ్చింది. బాగా చదువుకుంది. మస్తుగా డబ్బుంది. మొగుడికి విడాకులివ్వటంగురించి సలహా తీసుకోడానికి వచ్చింది. సుందరమ్మగురించి నవ్వింది!

ఉప్పునీటినూతిలో కప్ప నిర్మల జలప్రవాహాన్నిగురించి నూతిదగ్గరకు వచ్చిన వాళ్లు చెప్పుకుంటే విన్నది. సమర్థతా, శక్తీ లేక అదంతా మిథ్య అన్నది. ఈ వుప్పునీరే ప్రపంచం, బ్రతుకూ, అంతానూ......

పద్మ హేళన చేసి నవ్వింది!!

* * *

సుందరమ్మ వచ్చి నెలరోజులైంది. వచ్చినరోజున వెంకమ్మను చూసి మనసులో కొంచం శాంతి యేర్పడేది. కాని యిప్పుడు అశాంతి మనసులో పెనుగులాడుతూనే వుంది. మాటిమాటికీ కృష్ణారావు ఆమె యెదట పడటం, యిదివరలా అతని ముఖం వేపు చూస్తుందో లేదో అని వుబలాటపడటం జరుగుతోంది. సుందరమ్మ పొరపాటునైనా ముఖం యెత్తలేదు. అందమైన ఆడదానిముఖంకోసం కథల్లోనూ, కలల్లోనూ పరితపించే కృష్ణారావుకు వికారమెత్తింది. తను అందగాలేనేమోనని పదిసార్లు అద్దం తీయించుకున్న అన్నిఫొటోలు చూశాడు. సుందరమ్మ తన అందాన్ని కాదు, మనసును ప్రేమించిందని అనుకోవటానికి తగ్గ జ్ఞానమైనా లేకపోయింది! అందరూ తన అందాన్ని గుర్తించి స్తుతించుకోవాలనే వుబలాటలతో వున్న కృష్ణారావుకు యీ మార్పేమీ బాగా లేదు.

సుందరమ్మకు బ్రతుకుమీద అసహ్యం వేసినా, అన్నయ్య యెముకలపోగైనా చూపించిన అభిమానంతో యీ నరకంలో బ్రతకనిస్తున్నాడు. ఈ నరకంలో తనెలాగో పాపం అనుభవించి బాధపడటం తప్పించి, అక్కడే ఒక స్వర్గం నిర్మించేశక్తి లేదనుకుంది.

ఇంటి యజమానురాలు మధ్యాహ్నమే చెప్పింది సాయంత్రం అయిదుగంటలకే వంట కావాలని.

సుందరమ్మ వంట చేసి కూర్చుంది. "బట్టలు మార్చు. సినీమాకి వెళ్దాం" అని చెప్పి హడావుడిగా వెళ్లిపోయింది. సుందరమ్మకు మొదట వెళ్లాలని లేకపోయినా, ఇదివరకు సినీమాగురించి విన్నదికాబట్టి అదేమిటో చూద్దామనే కుతూహలంపుట్టింది.

సుందరమ్మఒక్కర్తెను డిగువక్లాసులోకి పంపించి పక్కా గంటసేపు అలంకరించుకోవటంవల్ల వచ్చిన వయ్యారంతో తల్లీ కూతురు వెళ్లి కుర్చీల మీద కూర్చున్నారు. హాలునిండా జనం క్రిక్కిరిసివున్నారు. ఆమెచుట్టూ వున్న ఆడవాళ్లవేపే అమాయకంగా చూస్తోంది. అపరిచితులతో మాటలెలా కలపడమనే విషయం అటుంచి, కలపటంగురించే ఆలోచించలేదు.

తెరమీద బొమ్మలుపడ్డాయ్. రానురాను దేవుళ్లు కనిపించారు. మనస్సంతా భక్తితో నిండిపోయింది. నోరు ఆవలించి అమాయకంగా యేదో అనుభూతి పొందుతోంది.

దీపాలు వెలిగాయ్. పెద్ద సంశయంతో కొట్టుకుంటున్నా వెళ్లిపోవాలని లేచి నిలబడింది. చుట్టుప్రక్కలవాళ్లెవరూ కదల్లేదు. ధైర్యం తెచ్చుకొని "అవునమ్మా ఆ రాధ యేమైంది?"అని ప్రక్కావిడని అడిగింది. సావధానంగా "కూర్చో అమ్మా! చూద్దువుగాని" అంది ఆవిడ.

కొంతసేపట్లో దీపాలు ఆరిపోయాయ్. అవేవో రంగురంగుల అక్షరాలు, బొమ్మలు అగపడ్డాయి. వెంటనే శ్రీకృష్ణుడు కనిపించాడు. మనస్సంతా భక్తితోనిండిపోయింది. రెప్పవేస్తే దేవుడెక్కడ మాయమైపోతాడో అన్నట్లుగా చూస్తోంది...

సినీమా విడిచిపెట్టారు. బండిలో కూర్చున్నా కళ్లయెదురుగా గోకులం, రాధా, కృష్ణుడు...వున్నారు. ఆనందంతో మనస్సంతా ఊగులాడింది. ఆ రోజు ఒకగొప్ప పుణ్యదినం అనుకుంది.

ఆరాత్రి ఆమెకు నిద్ర రావటంలేదు. మనసునిండుగా తృప్తి వుంది. ఆలోచిస్తున్న కొద్దీ రాధకు జోహారు లర్పించుకుంటోంది. గోకులంలో అందరూ ఆమెను నిరాకరించారు. తిట్టారు, కొట్టారు...ఇంత చేసినా నవ్వుతూ, ఆడుతూ...ఆ కృష్ణుని...యీ ధోరణిలోనే సుందరమ్మ తన పని చేస్తోంది.

ప్రక్కనే వున్న రెండు గదుల్లోనూ చాలా రాత్రివరకు దీపాలు వెలుగుతున్నయ్.

ఒకసారి పద్మగదివేపు తేరిపార చూచింది. పుస్తకంలో ఒక యువకుని ఫొటో పెట్టుకొని పద్మ దీక్షగా చూస్తోంది. అప్పుడప్పుడూ వక్షానికి అదుముకుంటోంది.

ఆమెదృష్టి మెల్లగా ఆగదిలోనే టేబిలు మీద వున్న మురళీకృష్ణుని వేపు పోయింది. కళ్లు అప్పచెప్పి చూస్తోందేగాని మనస్సంతా రాధతోనే నిండిపోయింది. తన కష్టాలకీ రాధకష్టాలకీ యేదో సంబంధం వుందనికూడా అనుకుంది...

రానురాను...అదేదో మగతలా...ఒడ్డుకు కొట్టుకుపోవాలని ఆత్రుతపడే సముద్రతరంగాలలా, ఆమెలో భక్తితరంగాలు ఆత్రుత పడుతున్నాయ్.

పద్మ దీపం ఆర్పి పడుకుంది. చాలసేపటివరకూ సుందరమ్మ ఒళ్లంతా జలదరిస్తునే వుంది...అదోకలా అయిపోయింది...లేచినది...నవ్వుకుంది...చేతులు గట్టిగా దులుపుకుంది...పద్మగదిలోకి వెళ్లింది...

ఒళ్లంతా వుబ్బిపోయింది. మనస్సంతా భక్తితో పొంగిపోయింది. కెరటాల్లా చేతులు ఆడిపోయాయ్. తల బరువెక్కిపోయింది. మురళీకృష్ణుని పాదాలమీద తల ఆన్చి గట్టిగా కౌగిలించుకుంది.

వినీలాకాశంలో చందమామ చంద్రికలు వెదజల్లుతున్నాడు. భక్తీ, ప్రేమా, అనురాగం త్రివేణీలా కలసిపోయాయ్...చెక్కిళ్లపైనించి మెల్లగా కన్నీటిధారలు జారుతున్నయ్...

ఏమంటుందో యేం చేస్తోందో...భక్తిలోలీనమైతాను అనుకున్న నరకంలో మానవమాత్రుల కెవరికీ అక్కరలేని తన శరీరం వున్నదనే విషయం మరచిపోయిందేనూ!

మెలుకువ వచ్చేసరికి గది కాంతివంతంగా వుంది. వాళ్లంతా యెవరో యెందుకు నవ్వుతున్నారో ఆమె కేమీ అర్థంకాలేదు. పద్మ గొంతుకమాత్రం పోల్చింది.

"సినీమా అంతా నిజం అనుకుంది. పాపం! లే అమ్మా రాధాదేవీ! ఆ పూల దండ నలిపేశావ్ - గదిలోకి యింకెప్పుడూ రాబోకు!"

యీమాటలు వినటానికి కటువుగా వున్నా, సుందరమ్మ మనసులో నవ్వుకొని అనుకుంది. "ఈ నరకంలోనే ఒక స్వర్గం వుంది. దేవుడే నన్ను ప్రేమించేటప్పుడు- మీరు ప్రేమించకుండా బ్రతగ్గలరా? మీరే మన్నా ప్రేమతోనే అంటున్నారు!"